

మేటల మ్యాపింగ్

- ఇసుక మేటల గుర్తింపునకు రంగం సిద్ధం
- జలవనరుల శాఖకు భూగర్భ గనుల శాఖ లేఖ
- స్టాక్ పాయింట్లలో ఇసుక భారీగా తగ్గుముఖం
- అందుబాటులో ఉన్న ఇసుక 88 వేల మెట్రిక్ టన్నులే

ఇసుక ఖాళీ..

కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి ఎన్టీఆర్ జిల్లాలోని ఎనిమిది స్టాక్ పాయింట్లలో 3 లక్షలా 69 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉండేది. ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించిన తర్వాత ఈ పాయింట్లలో ప్రస్తుతం 88 వేల మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే అందుబాటులో ఉంది. అంటే 2 లక్షలా 81 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఖాళీ అయ్యింది.

తవ్వకాలకు అవకాశాలేంటి?

జగ్గయ్యపేట నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు ఎక్కడెక్కడ ఇసుక మేటలున్నాయి? ప్రకాశం బ్యారేజీ దిగువ నుంచి హంసలదీవి మధ్యలో ఇసుక మేటలు ఎక్కడున్నాయి? ఇవి నదిలో ఏ పరిస్థితుల్లో ఉన్నాయి? అనే వివరాలు సేకరించడానికి జలవనరుల శాఖ ఒక సర్వే చేయబోతోంది. ఇసుక మేటలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి తవ్వకాలకు భూగర్భ గనుల శాఖ అనుమతులిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : కృష్ణానదిలో వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా తవ్వకాలు చేసింది. జేపీ కంపెనీ కృష్ణానదికి ఎగువ, దిగువన లెక్కలేనంత ఇసుకను తవ్వేసింది. స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించిన తర్వాత స్టాక్ పాయింట్లలో ఇసుక తగ్గుముఖం పడుతోంది. ఉమ్మడి జిల్లాలోని భవన నిర్మాణదారులు ఈ స్టాక్ పాయింట్లలోని ఇసుకను తీసుకెళ్తున్నారు.

● నది స్వరూపంపై అంచనా

ప్రస్తుతం ఎగువ ప్రాజెక్టుల నుంచి ఎలాంటి నీటి విడుదలా లేదు. ఎగువ తెలంగాణలో కురిసిన వర్షాలతో వాంగులు, వంకలు నిండుగా ప్రవహిస్తున్నాయి. ఈ నీరంతా కృష్ణా నదిలోకి వస్తోంది. ఎగువ నుంచి నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నది భౌగోళిక స్వరూపంలో మార్పులు వస్తాయి. ఒకచోట ఉన్న ఇసుక మేటలు కొట్టుకుపోయే అవకాశం ఉంటుంది. కొత్తగా మరోచోట ఇసుక మేటలు ఏర్పడతాయి. ఈ మేటలను నీటి ప్రవాహం తగ్గినప్పుడు మాత్రమే గుర్తించే వీలుంటుంది. గత ప్రభుత్వం ఇసుక తవ్వకాలను జేపీ సంస్థకు ఇవ్వడమే కాకుండా ప్రకాశం బ్యారేజీ వద్ద నుంచి వెంకటాయపాలెం వరకు ఉన్న నది భాగంలో డీసిల్టింగ్ పనులు చేపట్టింది. ఇక్కడి నుంచి డ్రెడ్జింగ్ ద్వారా బయటకు తీసిన ఇసుక ఏమైపోయిందో తెలియలేదు.

● నాణ్యమైన ఇసుకను కారుచౌకగా కొట్టేసి..

నదిలో ఇసుక మేటలు (సిల్టింగ్ పాయింట్లు) పేరుకుపోయే ప్రదేశాలను గుర్తించడానికి బ్యాథమెటిక్ సర్వే (ఇసుక ఎంత ఉందో గుర్తించే ప్రక్రియ) నిర్వహించారు. వాస్తవానికి సిల్టు తవ్వకాల ద్వారా ఇసుక అత్యంత సారవంతంగా ఉంటుంది. దీనికి మంచి గిరాకీ ఉంటుంది. ఆ ఇసుకను కొనుగోలు చేయడానికి బిల్డర్లు పోటీపడతారు. అటువంటి ఇసుకను గత ప్రభుత్వం అధికార పార్టీకి చెందినవారికి కారుచౌకగా కట్టబెట్టింది.

కొత్త ఇసుక మేటల గుర్తింపు

ప్రస్తుతం స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక నెల రోజుల వరకు సరిపోతుందని భూగర్భ గనుల శాఖ అధికారులు అంచనా వేశారు. ఆ తర్వాత ఇసుక కొరత లేకుండా చేయాలంటే నదిలో తవ్వకాలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కృష్ణానదిలో ఇసుక మేటలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని జలవనరుల శాఖ అధికారులకు భూగర్భ గనులశాఖ అధికారులు లేఖ రాసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. నదిలో జరిగే తవ్వకాలకు జలవనరుల శాఖ, భూగర్భ గనుల శాఖల ఎన్ఓసీ కచ్చితంగా ఉండాలి. నదిపై పూర్తి పర్యవేక్షణ జలవనరుల శాఖకు ఉంటుంది. జలవనరుల శాఖ ఎస్ఈ, నది పరిరక్షణ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో ఇసుక మేటలను గుర్తించాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి ప్రకాశం బ్యారేజీకి వరద వస్తోంది. ఇది క్రమంగా తగ్గుముఖం పడుతోంది. వరద పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టిన తర్వాత మేటలను అధికారులు మ్యాపింగ్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకు ఇసుక మేటల గుర్తింపునకు సంబంధించి ఎలాంటి సమాచారమూ అందలేదని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

బదిలీలు ఆలస్యం!

తహసీల్దార్ల మార్పునకు మరికొంత సమయం



తహసీల్దార్ల బదిలీలు మరింత ఆలస్యమయ్యేలా ఉన్నాయి. పాత ఉభయ గోదావరి జిల్లాల్లో వరదలు పోటెత్తుతుండటం సమస్య సద్దుమణిగేదాకా అక్కడి నుంచి రిలీవ్ చేయలేకపోతున్నారు. మచిలీపట్నం, గుడివాడ, పెనమలూరు, గన్నవరం లాంటికి ముఖ్యమైన కేంద్రాలకు బదిలీ చేయించుకునేందుకు కొందరు అధికారులు క్యూ కడుతున్నట్టు తెలుస్తోంది. కూటమి నేతలను ప్రసన్నం చేసుకొని పైరవీలు సాగిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. నమ్మకమైన అధికారులను ఎంపిక చేసుకోవడంలోనూ కూటమి నేతలకు సమయం పడుతున్నట్టు సమాచారం.

- ఇతర జిల్లాల్లోని అధికారులు రిలీవ్ కానందునే..
- గోదావరి వరద తగ్గాకే ప్రక్రియ మొదలు
- ఈలోపు ఎమ్మెల్యేల సిఫార్సులు ముమ్మరం
- ముఖ్య కేంద్రాలకు వెళ్లేందుకు విశ్వప్రయత్నాలు
- పైరవీలకు వెనుకాడని అధికారులు
- ఆచుతూచి అడుగేస్తున్న కూటమి నేతలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వెళ్లిన 30 మందిని తిరిగి జిల్లాకు పంపుతూ సీసీఎల్ఏ కమిషనర్ గత శనివారం ఉత్తర్వులు జారీ చేసినా రిలీవ్ కావడం మరికొంత ఆల్యమతోంది. ఇతర జిల్లాల నుంచి ఎన్నికల సమయంలో బదిలీపై జిల్లాకు వచ్చిన తహసీల్దార్లు అధికశాతం మంది జిల్లా నుంచి వెళ్లిపోయేందుకు సిద్ధంగా ఉన్నారు. జిల్లా నుంచి ఎన్నికల విధుల నిమిత్తం ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లినవారు జిల్లాకు వచ్చి కలెక్టర్‌కు రిపోర్టు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితే జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న తహసీల్దార్లను కలెక్టర్ రిలీవ్ చేసే అవకాశం ఉంది. కొద్దిరోజుల వ్యవధిలో బదిలీపై వెళుతున్నామనే కారణంతో ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న త హసీల్దార్లు కార్యాలయంలో కీలకమైన పనులను పక్కనపెట్టి తమను ఎప్పుడు రిలీవ్ చేస్తారా అని ఎదురుచూస్తున్నారు.

ఆచితూచి అడుగేస్తున్న కూటమి నాయకులు

పైరవీలకు పాల్పడుతున్న అధికారులకు ఎవ్వరికీ మాట ఇవ్వకుండా కూటమి నాయకులు మంచి అధికారిని ఇక్కడకు తెచ్చుకునేందుకు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. కొందరు తహసీల్దార్లు గతంలో తమకు పరిచయం ఉన్న ద్వితీయశ్రేణి నాయకులను శాసనసభ్యులు, మంత్రుల వద్దకు పంపి తాము కోరుకున్న మండలంలో పోస్టింగ్‌లు ఇప్పించుకునేందుకు పైరవీలు వేగవంతం చేశారు. తమకు అనుకూలంగా ఉన్న తహసీల్దార్లను ఎంచుకున్న శాసనసభ్యులు సిఫార్సు లేఖలు ఇచ్చారని, వాటి ఆధారంగానే బదిలీలు ఉంటాయని రెవెన్యూ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

అప్రధాన పోస్టులపై విముఖత

జిల్లాకు వచ్చే 30 మంది తహసీల్దార్లలో కొంతమందిని మచిలీపట్నం, ఉయ్యూరు, గుడివాడ ఆర్డీవో కార్యాలయాల్లో ఏవోలుగా, మరికొందరిని వివిధ విభాగాల్లో సర్దుబాటు చేయాల్సి ఉంది. ఆర్డీవో కార్యాలయాల్లో ఏవోలుగా వెళ్లేందుకు కొందరు సుముఖంగానే ఉన్నా, తహసీల్దార్ కేడర్‌లో ప్రాధాన్యతలేని పోస్టుల్లోకి వెళ్లేందుకు ఎవ్వరూ ఇష్టపడటం లేదు. దీంతోపాటు వైసీపీ హయాంలో అడ్డగోలు పనులన్నీ చేసిన తహసీల్దార్లకు జిల్లాలో ఏ మండలాలను కేటాయిస్తారనే అంశంపై రెవెన్యూ ఉద్యోగులలో చర్చ జరుగుతోంది. తహసీల్దార్ల బదిలీలు జరిగితే కిందిస్థాయి సిబ్బంది బదిలీలు ఉంటాయని, ఈ ప్రక్రియ ఎప్పటికి ప్రారంభమవతుందనే అంశంపై రెవెన్యూ ఉద్యోగుల సంఘాల నాయకులు ఆరా తీస్తున్నారు.

తెరవెనుక పైరవీల పర్వం



- తహసీల్దార్ల బదిలీల వ్యవహారం వచ్చే వారంలో ఊపందుకోనుంది. జిల్లాకు రానున్న తహసీల్దార్లు తమకు అనుకూలమైన మండలాల్లో పోస్టింగ్ తెచ్చుకునేందుకు నాలుగు రోజులుగా తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నారు.
- జిల్లాలో 25 మండలాలు ఉండగా కీలకమైన మచిలీపట్నం, ఉయ్యూరు, గుడివాడ, పెనమలూరు, గన్నవరం, బాపులపాడు, పెడన, చల్లపల్లి, అవనిగడ్డ, కంకిపాడు తదితర మండలాల్లో పోస్టింగ్ కోసం తహసీల్దార్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అధిక ఆదాయం వచ్చే మండలాల్లో పోస్టింగ్ తెచ్చుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు.
- ఎన్నికల విధుల నిమిత్తం ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చిన నలుగురైదుగురు తహసీల్దార్లు ప్రస్తుతం తాము పనిచేస్తున్న మండలాల్లోనే కొనసాగేలా తెరవెనుక చక్రం తిప్పుతున్నారు.
- బాపులపాడు మండలంలో తహసీల్దార్ పోస్టుకోసం ఇప్పటికే ముగ్గురు తెరవెనుక ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు తెలిసింది. ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ తాను ఇక్కడి నుంచి వెళ్లిపోతానని, అప్పటివరకు మల్లవల్లి తదిత ర గ్రామాలకు సంబంధించిన భూమి వ్యవహారాలు తన వద్దకు తీసుకురావద్దని చెబుతున్నట్టు సమాచారం.
- గన్నవరం నియోజకవర్గంలోని ఒకటి, రెండు మండలాలకు చెందిన తహసీల్దార్లు తాము ఎన్నికల విధుల నిమిత్తం వచ్చినా తమను ఇక్కడే కొనసాగించాలని పైరవీలు ప్రారంభించినట్టు రెవెన్యూ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.
- జిల్లా కేంద్రమైన మచిలీపట్నం మండలంలో పనిచేసేందుకు తాము వస్తామని ఇప్పటికే నలుగురు తహసీల్దార్లు ముందుకు వచ్చి తమదైన శైలిలో స్థానిక నాయకుల ద్వారా పావులు కదుపుతున్నారు.

విరమణ పేరిట.. సమర్పణ

ఉద్యోగులు, సంఘాలపై వసూళ్ల ఒత్తిడి



ఈఎన్‌సీ పదవీ విరమణ వేడుకకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ధనకార్యాలు

విలాసవంతమైన ఫంక్షన్ హాల్.. ఖరీదైన భోజనాలు.. బహుమతిగా వజ్రాలు పొదిగిన బంగారు గండపెండేరం.. ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) పదవీ విరమణా.. మజాకానా.. ముఖేష్ అంబానీలా అన్నీ రాయల్‌గా ఉండాలనుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆ భారాన్ని మాత్రం ఉద్యోగ సంఘాలు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, కాంట్రాక్టర్లపై పడేశారు. పదవీ విరమణ వేడుక పేరు చెప్పి టార్గెట్లు విధించి రూ.లక్షలకు లక్షలు వసూలు చేస్తున్నారు.

- స్పోర్ట్స్ రిక్రియేషన్ నిధులు రూ.25 లక్షలపై కన్ను
- క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్లకు లక్షల్లో టార్గెట్లు
- కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లు చేస్తున్న ఇంజనీర్లు
- ఈఎన్‌సీకి గిఫ్ట్‌గా వజ్రాల బంగారు గండపెండేరం
- మరిన్ని అమూల్యమైన కానుకల కోసమే వసూళ్లు
- ప్లేటు భోజనానికి రూ.2 వేలు పెట్టాలని యోచన
- విలాసవంతమైన ఫంక్షన్ హాల్లో వేడుకకు ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) పదవీ విరమణ పేరుచెప్పి ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలకు బలవంతంగా టార్గెట్లు విధించి, వసూళ్లకు తెగబడటం వివాదంగా మారింది. గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఈఎన్‌సీగా పనిచేస్తున్న కృష్ణారెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చెందుతున్న నేపథ్యంలో భారీగా రిటైర్‌మెంట్ వేడుక నిర్వహించాలని ఈఎన్‌సీ కార్యాలయం నిర్ణయించింది. మహానాడు జంక్షన్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి అయ్యే ఖర్చు కోసం డబ్బులివ్వాలంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులను ఈఎన్‌సీ కార్యాలయ అధికారులు బలవంత పెడుతున్నారు. వారం రోజులుగా ఈఎన్‌సీ కార్యాలయ అధికారులు ఇదే పనిలో ఉన్నారు. 'వెయ్యో, రెండు వేలో ఇస్తాం.. కానీ, లక్షల రూపాయలు తామెక్కడ ఇస్తాం..' అంటూ ఉద్యోగులు చాలా వరకు మొండికేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సంఘంపై కూడా ఇదే రకమైన ఒత్తిడి తెచ్చారు. సదరు సంఘం ససేమిరా.. అనటంతో బలవంతం చేస్తున్నారు. గతంలో రిక్రియేషన్ స్పోర్ట్స్ కోసం ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్‌కు ఈఎన్‌సీ కార్యాలయం రూ.25 లక్షలు కేటాయించింది. ఈ మొత్తంలో సింహభాగాన్ని ఈఎన్‌సీ రిటైర్‌మెంట్ వేడుకకు ఖర్చు చేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు. ఈఎన్‌సీ కార్యాలయ అధికారులు బలవంతం చేయటంతో కొంతమంది ఉద్యోగులు తప్పక డబ్బు సమర్పించుకుంటున్నారు. మరికొందరు ఎదురు తిరుగుతున్నారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుంచి ప్రతిఘటన వస్తుండటంతో ఈఎన్‌సీ కార్యాలయ అధికారులు రూటు మార్చారు.

క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్‌కు టార్గెట్లు

క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్లపై టార్గెట్లు పెట్టారు. ఒక్కో క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ రూ.3 లక్షలకు తక్కువ కాకుండా వసూలు చేసి పంపాలని నిర్దేశించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు, కాంట్రాక్టర్లకు ఈ టార్గెట్లు విధించారు. దీంతో కాంట్రాక్టర్లందరి దగ్గర నుంచి రూ.3 లక్షల చొప్పున వసూలు చేసి ఈఎన్‌సీ కార్యాలయ అధికారులకు పంపుతున్నారు. ఇంత భారీ ఎత్తున ఎందుకు వసూలు చేస్తున్నారని ఆరా తీయగా, ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పదవీ విరమణ చెందుతున్న ఈఎన్‌సీకి వజ్రాలు పొదిగిన బంగారు గండపెండేరాన్ని బహుమతిగా ఇవ్వాలని నిర్ణయించారని, దీనికే ఎక్కువ ఖర్చు అవుతుందని, అందుకే ఇలా టార్గెట్లు విధించారని తెలిసింది. అలాగే, ఒక్కో అతిథికి అందించే భోజనం ఖరీదు రూ.2 వేలుగా నిర్ణయించారని సమాచారం. ఈఎన్‌సీకి సమర్పించే ఇతరత్రా కానుకలు అమూల్యమైనవిగా ఉండాలని, వీటికోసం భారీగా ఖర్చు చేయాల్సి రావడం వల్లే ఈ టార్గెట్లు అని ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఇప్పుడు చర్చ నడుస్తోంది.

'కృష్ణలీలలు' పుస్తకం హల్‌చల్

ఓవైపు ఈఎన్‌సీ కృష్ణారెడ్డి పదవీ విరమణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని సన్నాహాలు చేస్తుండగా, మరోవైపు ఆయన లీలలపై కొందరు కాంట్రాక్టర్లు ముద్రించిన 'కృష్ణలీలలు' పుస్తకాన్ని ఆహ్వానితులకు ఎలాగైనా పంపిణీ చేయాలని తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏదో రకంగా ఫంక్షన్ హాల్లోకి వచ్చి ఆ పుస్తకాలు పంచుతామని కాంట్రాక్టర్లు ఇప్పటికే ప్రచారం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వానికి అంటకాగి, ఆయన సాగించిన 'ధన'కార్యాలను సాక్ష్యాలతో సహా పుస్తకం రూపంలో వెలువరించామని పలువురు కాంట్రాక్టర్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులకు వాట్సాప్ మెసేజ్‌లు పంపిస్తున్నారు.

దుర్గగుడిలో బదిలీల రచ్చ!

- అంతర్గత బదిలీల పేరిట తూతూమంత్రంగా ఉత్తర్వులు
- మొత్తం 84 మందికి ఆదేశాలు
- సీటు కదిలింది మాత్రం ఏడెనిమిది మందే..

6లో..

కబ్జాకోరల్లో కళామందిరం

- నిర్వహణ గడ్డం గ్యాంగ్ ఆధీనంలోకి..
- చుట్టూ దుకాణాల అద్దెలు వారి జేబుల్లోకి..
- ఎన్నికల సమయంలో నానీ కార్యకలాపాలన్నీ ఇక్కడి నుంచే..
- ఏడేళ్లుగా పట్టించుకోని అధికారులు

పట్టణం నడిబొడ్డున ఉన్న కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జాకోరల్లో చిక్కుకుంది. ఆనాడు బారిష్టర్ శతావధాని కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పేరిట నిర్మితమైన త్రిపురనేని శివప్రసాదరావు స్మారక భవనం గడ్డం గ్యాంగ్ స్వాధీనమైంది. ఇటీవల ఎన్నికల సమయంలో భవనాన్ని కొడాలి నాని వ్యక్తిగత కార్యాలయానికి వినియోగించారు. కళామందిరం చుట్టూ రెస్టారెంట్‌తో పాటు 25 దుకాణాలు వెలిశాయి. వాటిపై అద్దె ఆదాయమూ ఆక్రమణదారులే దండుకుంటున్నారు.

గుడివాడ : గుడివాడలో కళలను, కళాకారులను, రచయితలను ప్రోత్సహించడానికి ఆనాడు పట్టణ నడిబొడ్డులో కవిరాజు కళామందిరాన్ని నిర్మించారు. ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియానికి ఆనుకుని సువిశాల స్థలంలో ఇది నిర్మితమైంది. మొదట్లో కళాకారులకు స్వర్గధామంగా ఉండేది. కాలక్రమేణా కళలు అంతరించిపోవడం, కళాపోషకులు తగ్గిపోవడంతో కళామందిరం ఖాళీ అయ్యింది. దాని ఆవరణలోనే గ్రంథాలయం కూడా ఏర్పాటు చేశారు. అది కూడా పాఠకులకు అందుబాటులో లేదు. 20 ఏళ్లుగా కళామందిరంలో ఎటువంటి కార్యక్రమాలూ జరగడం లేదు. దీంతో కళామందిరాన్ని ఇతర అవసరాలకు వినియోగించుకోవడం ప్రారంభించారు. ఇది అంగలూరుకు చెందిన ఒక వ్యక్తి స్వాధీనం ఉండేది.

● నిద్రావస్థలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

2014-19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో కవిరాజు కళామందిరాన్ని స్వాధీనం చేసుకోవాలని అప్పటి కలెక్టర్.. ఆర్డీవోకు ఆదేశాలిచ్చారు. ఈ విషయంలో ఆక్రమణదారుడు హైకోర్టును ఆశ్రయించగా, సివిల్ వివాదాన్ని స్థానిక కోర్టుల్లో తేల్చుకోవాలని ఆదేశాలిచ్చినట్టు సమాచారం. దీంతో ఆర్డీవో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని అప్పటి



తహసీల్దార్‌కు ఆదేశాలిచ్చారు. ఉత్తర్వులిచ్చిన ఏడాది వరకు ఎటువంటి స్వాధీన ప్రక్రియకు అధికారులు ఉపక్రమించలేదు. రెవెన్యూ అధికారులు ఆనాటి ఎమ్మెల్యే కొడాలి నాని ఆదేశాలతో గమ్మున ఉండిపోయారు. రెవెన్యూ అధికారులు గానీ, మున్సిపల్ అధికారులు గానీ ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించలేదు.

గడ్డం గ్యాంగ్ ఆధీనంలోకి..

2019లో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో సదరు ఫైల్ బుట్టదాఖలైంది. ఐదేళ్ల వ్యవధిలో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. 2023 జూలైలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆ స్థలాన్ని మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకోవాలని ఉత్తర్వులిచ్చారు. అప్పటి ఎమ్మెల్యే కొడాలి నానీకి మంత్రి పదవి పోయాక సదరు స్థలాన్ని ఓపెన్ ఎయిర్ థియేటర్‌గా మార్చే విధంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. అయితే అప్పటికే నానీస్ గడ్డం గ్యాంగ్ కళామందిరంలో పాగా వేసింది. ప్రతిరోజు పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం, గంజాయి సేవించడానికి వేదికగా మార్చుకున్నారు. అప్పుడప్పుడు ఎవరినైనా కొట్టాలంటే ఇక్కడికే తీసుకుని వచ్చేవాళ్లు. కళామందిరం గడ్డం గ్యాంగ్ ఆధీనంలో ఉండటంతో ఫైల్ ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదు. ఎన్నికల కౌంటింగ్ ముందు రోజు కూడా భవనంలో గడ్డం గ్యాంగ్ తమ కార్యకలాపాలను అక్కడి నుంచి నడిపినట్టు స్థానికులు చెబుతున్నారు.

అద్దె ఆదాయం ఎవరి జేబుల్లోకి?

కళామందిరాన్ని కొన్నాళ్లు ఫర్నీచర్ దుకాణంగా, అడపదడపా ఎగ్జిబిషన్‌లకు అద్దెకిచ్చేవారు. కళామందిరం చుట్టూ 24 దుకాణాలు వెలిశాయి. వెనుక భాగంలోని ఖాళీ స్థలంలో పదేళ్లుగా రెస్టారెంట్ నడుస్తోంది. ఒకరిద్దరు మాత్రం క్రమం తప్పకుండా ప్రతినెలా అద్దెలు చెల్లిస్తున్నామని పేర్కొంటున్నారు. అసలు ఏడేళ్ల కాలంలో కళామందిరం, దుకాణాల ద్వారా వచ్చిన అద్దె ఆదాయం ఏమైందో, ఎవరి జేబుల్లోకి వెళ్లిందో అధికారులు తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. మున్సిపల్ ఆధీనంలోకి వెళ్లినా అధికారికంగా మున్సిపాల్టీ అద్దెలు వసూలు చేసిన దాఖలాలు లేవు. నేటికీ దుకాణాల అద్దె ఆదాయం ఏమవుతుందో ఇటు మున్సిపల్ అధికారులకు గానీ, రెవెన్యూ అధికారులకు గానీ తెలియదు. నానిస్ గడ్డం గ్యాంగ్‌లోని ఒకవ్యక్తి ఆ దుకాణ సముదాయం అద్దె ఆదాయాన్ని స్వాహా చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.



దుర్గగుడిలో హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

15 రోజులకు దుర్గమ్మ హుండీ కానుకలు
రూ. 2,68,18,540

వన్‌టౌన్, జూలై 25 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను గురువారం మహామండపంలో లెక్కించారు. 15 రోజులకుగాను రూ. 2,68,18,540 నగదు సమకూరింది. రోజుకు సగటున రూ.17,54,569 మేరకు కానుకలు వచ్చాయి. 380 గ్రాముల బంగారం, 5కిలోల 540గ్రాముల వెండి కానుకల రూపంలో సమకూరాయి. 281 యూఎస్‌ఏ డాలర్లు, 70 ఆస్ట్రేలియా డాలర్లు, 20 ఇంగ్లండ్ పౌండ్లు, 401 ఓమన్ రియాల్స్, 5 కెనడా డాలర్లు, 10 యూఏఈ దీర్హమ్‌లు, 10 సింగపూర్ డాలర్లు, 110 యూరప్ యూరోలు, 20 ఇజ్రాయిల్ షేకల్స్, ఒక మలేషియా రిగ్గింట్, 10 సౌదీ రియాల్స్ వచ్చాయి. ఆన్‌లైన్ ఈ హుండీ ద్వారా రూ. 54,228 వచ్చాయి. లెక్కింపును ఈవో కేఎస్ రామారావు, డిప్యూటీ ఈవో లీలాకుమార్, వన్‌టౌన్ పోలీసులు ఎస్‌పీఎఫ్, దేవదాయశాఖ అధికారులు పర్యవేక్షించారు.

కొండాలమ్మ ఆలయంలో..



గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ ఆలయంలో గురువారం హుండీల కానుకల లెక్కింపు నిర్వహించారు. 60 రోజులకుగాను అమ్మవారికి భక్తులు రూ27.19లక్షలు కానుకలుగా సమర్పించారని ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

ఇగ్నోలో ఎంఏ భగవద్గీత కోర్సు

వన్‌టౌన్, జూలై 25 : ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో కొత్తగా ఎంఏ భగవద్గీత కోర్సును ప్రవేశపెట్టినట్టు రీజనల్ డైరక్టర్ డీఆర్ శర్మ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం పరిధి 15 జిల్లాలకు విస్తరించి ఉందని తెలిపారు. మొత్తం 12 అధ్యయన కేంద్రాలు పనిచేస్తున్నట్టు తెలిపారు. 44 మాస్టర్స్ డిగ్రీలు, 24 డిగ్రీలు, 46 డిప్లమా, పీజీ డిప్లమా, 60 సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు మొత్తం 180 కోర్సులను విద్యార్థులకు అందిస్తున్నామని, తాజాగా ఎంఏ భగవద్గీత కోర్సును ప్రవేశపెట్టినట్టు తెలిపారు దీంతో పాటు ఎంబీఏ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ అండ్ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్, సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్, అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్ ఎంఏ అప్లయిడ్ ఉర్దు కోర్సులను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. మరోవైపు నర్సరీ పిల్లలకు బోధించే పీజీ డిప్లమా ఇన్ ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ కోర్సు కూడా ఉందన్నారు. ఎంఏ సైకాలజీ, కౌన్సెలింగ్, ఫ్యామిలీ థెరపీలకు డిమాండ్ ఉందని తెలిపారు. ఇదే సమయంలో 2024 జూలై సెషన్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ డైరక్టర్లు డాక్టర్ కె.సుమలత, బి.ప్రసాద్‌లు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలి : జేసీ నిధి మీనా



కృష్ణలంక, జూలై 25 : సుమోటో వెరిఫికేషన్ ఆఫ్ క్యాస్ట్ ఫర్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్ జారీ అంశంపై గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జేసీ నిధి మీనా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియలో భాగంగా వెరిఫికేషన్‌ను వీఆర్‌వోలు పూర్తిచేయాలన్నారు. విజయవాడ వెస్ట్, నార్త్ మండలాల పరిధిలో క్షేత్రస్థాయి పరిశీలన పెండింగ్ ఎక్కువగా ఉన్నాయన్నారు. పెండింగ్‌లో వున్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వీఆర్‌వోలు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హత వున్న వారికి కులధృవీకరణ పత్రాలు జారీ చేసేలా తహసిల్దార్లకు సిఫార్సు చేయాలని భూ పరిపాలన శాఖ ఆదేశించిందన్నారు. పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పత్రాల జారీకి తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారులు, అన్ని మండల తహసిల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా రెవెన్యూ లాగిన్‌లో పెండింగ్‌లో వున్న సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పూర్తిచేసేలా మండల తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, తహసీల్దార్లు కిషోర్, శంకరబాబు, వీఆర్‌వోలు వున్నారు.

చంద్రబాబును కలిసిన పెన్షనర్స్ పార్టీ ప్రతినిధులు

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబును ఆంధ్రా పెన్షనర్ల పార్టీ ప్రతినిధులు సచివాలయంలో గురువారం సాయంత్రం కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. అనంతరం పెన్షనర్ల సమస్యలకు సంబంధించి వినతిపత్రం ముఖ్యమంత్రికి అందజేశారు. దీన్ని పరిశీలించిన చంద్రబాబు సాధ్యమైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారన్నారు. సీఎంను కలిసిన వారిలో పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్, గుడివాడ రామస్వామి, మూర్తి, నాగభూషణం, మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.

రేపు జిల్లాపరిషత్ సమావేశం

మచిలీపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27వ తేదీ శనివారం ఉదయం 10గంటలకు జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లాపరిషత్ కన్వెన్షన్‌హాలులో నిర్వహించనున్నట్టు జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జరిగే సమావేశంలో ఉమ్మడిజిల్లాకు చెందిన శాసనసభ్యులు, ఎంపీలు, జెడ్పీటీసీసభ్యులు పాల్గొంటారని ఆయన తెలిపారు. అన్ని విభాగాల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ఏఐటీయూసీ జిల్లా మహాసభలు వాయిదా

గుడివాడ : ఈ నెల 27, 28 తేదీల్లో గుడివాడలో జరగనున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభలు వాయిదా పడినట్టు జిల్లా కన్వీనర్, సీపీఐ జిల్లా అధ్యక్షుడు టి.తాతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలను అక్టోబర్ 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు.

విద్యార్థిని మిస్సింగ్ కేసు సుఖాంతం

గుడివాడ : నాగవరప్పాడులోని ఎస్సీ బాలికల వసతిగృహం నుంచి ఈ నెల 22న అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీని పోలీసులు గుర్తించారు. ఎస్పీ గంగాధర్‌రావు ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో 48గంటల్లో బాలిక ఆచూకీని కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెంది వసతిగృహం నుంచి వెళ్లిపోయినట్టు బాలిక పేర్కొంది. మిస్సింగ్ కేసును ఛేదించిన పట్టణ ఒన్‌టౌన్ సీఐ ఎల్.రమేష్, ఎస్ఐ పి.గౌతమ్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ గంగాధరరావు, డీఎస్పీ శ్రీకాంత్ అభినందించారు.

హైకోర్టు న్యాయమూర్తి పరామర్శ

హనుమాన్‌జంక్షన్, జూలై 25 : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గురువారం తన వద్ద పనిచేసే భద్రతా విభాగం ఉద్యోగి సనపల శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు. బాపులపాడు గ్రామంలో నివాసం ఉండే శ్రీనివాసరావు తండ్రి రామారావు రిటైర్డు పంచాయతీ ఉద్యోగి. ఆయన గురువారం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. న్యాయమూర్తి జ్యోతిర్మయి దంపతులు శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. రామారావు కానుమోలు పంచాయతీ కార్యాలయంలో సుదీర్ఘకాలంగా పనిచేయడంతో గ్రామ మాజీ సర్పంచ్‌లు చింతల వెంకటశివ అప్పారావు, దన్నే దుర్గారావు తదితరులు రామారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. రామారావు కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.

పారిస్ ఒలింపిక్స్‌పై అవగాహన సదస్సు

పెనమలూరు : స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరిం గ్ కళాశాలలో త్వరలో జరగనున్న పారిస్ ఒలింపిక్ క్రీడలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 33వ ఒలింపిక్స్ పోటీల్లో మన తెలుగు రా ష్ట్రాల నుంచి 8మంది క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. ఈసందర్భంగా కళాశాల నుంచి కానూరు వ రకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, పీడీ రఘు, కళాశాల డీన్ పాండురంగారావు, ఏవో సాయిబాబు పాల్గొన్నారు.



దుర్గగుడిలో బదిలీల రచ్చ!

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఇటీవల జరిగిన అంతర్గత బదిలీలపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయినవారికి, సొమ్ములు ఇచ్చినవారికి ప్రధాన పోస్టులను, మిగిలిన వారికి అప్రాధాన్య పోస్టులు అప్పగించారనే ఆరోపణలు వస్తున్నాయి. 84 మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేసినట్లు చెబుతున్నా.. ఏడెనిమిది మందికే పరిమితం చేశారని చెబుతున్నారు.

- అంతర్గత బదిలీల పేరిట తూతూమంత్రంగా ఉత్తర్వులు
- మొత్తం 84 మంది బదిలీ అని ఆదేశాలు
- సీటు కదిలింది మాత్రం ఏడెనిమిది మందే..
- మిగిలిన వారికి అదే సీటు.. అదే పోస్టు..
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఉద్యోగులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్)

దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకోసారి దుర్గగుడిలో అంతర్గత బదిలీలు జరుగుతాయి. కానీ, సుమారు ఆరు నెలలుగా ఎలాంటి బదిలీలు జరగలేదు. ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుండగా, రెండు రోజులుగా అంతర్గత బదిలీలు చేపట్టారు. అయితే, ఇవన్నీ నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. బుధవారం వరకు వివిధ కేటగిరీలకు చెందిన సుమారు 84 మందిని అంతర్గతంగా బదిలీ చేశారు. అయితే, సూపరింటెండెంట్ స్థాయిలో ఇద్దరికి, మిగిలిన ఉద్యోగుల్లో ఐదారుగురికి తప్ప మిగిలిన వారందరినీ వారు ఉంటున్న స్థానాల్లోనే కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీటిని ఏ విధంగా అంతర్గత బదిలీలు అంటారని పలువురు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. కొందరు ఉద్యోగులు సంవత్సరాల తరబడి ఒకే సీట్లో ఉండిపోతున్నారని, కీలకమైనవి కావడంతో పోస్టుకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకూ ముట్టజెబుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తాజా బదిలీల్లోనూ పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి.

గతంలోనూ అంతే..

గతంలో అర్చక విభాగంలో జరిగిన బదిలీల్లో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు అర్చకులు కూడబలుక్కుని ముఖ్య అధికారికి బంగారు బిస్కెట్‌ను బహుమతిగా ఇచ్చినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. తాజాగా అదే తరహాలో బహుమతితో ముఖ్య అధికారిని ప్రసన్నం చేసుకునేందుకు ఆ ఇద్దరు అర్చకులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇంకా ఏఈవోలు, అర్చకులు, పలు సెక్షన్లలో బదిలీలు జరగాలి. అయితే, ఈ బదిలీలకు కూడా నిర్దేశిత మొత్తాలను నిర్దేశించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

అదే సీటులో ఉంచి..

- దుర్గగుడికి చెందిన ఉద్యోగి ఒకరు దేవదాయ శాఖ కమిషనర్ వద్ద సీసీగా విధులు నిర్వహిస్తున్నారు. సుమారు మూడేళ్లుగా ఆయన అక్కడే విధులు చేపట్టారు. ఆయనకు అంతర్గత బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చేశారు. బదిలీ జాబితాలో మాత్రం చూపారు.
- 14 మంది సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వాస్తవానికి కేవలం ఇద్దరు ఉద్యోగులకే బదిలీ జరిగింది. మిగిలిన 12 మంది గతంలో ఏ విధులు నిర్వహిస్తున్నారో అదే విధులు నిర్వహించేలా బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.
- దుర్గగుడిలో వివిధ విభాగాల్లో పనిచేసే మరో 70 మందిని కూడా అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కానీ, వాస్తవంగా బదిలీ జరిగింది ఐదారుగురికే. మిగిలిన వారిని గతంలో వారు ఏ విధులు నిర్వహిస్తున్నారో అవే విధులు నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చారు.
- దుర్గగుడిలో ఐదుగురు ఏఈవోలు వివిధ విభాగాలను పర్యవేక్షిస్తుంటారు. అంతర్గత బదిలీల్లో వీరినీ బదిలీ చేయాల్సి ఉంది. కానీ, ఏడాదిగా వీరి జోలికే వెళ్లిన దాఖల్లాలేవు. ఈసారైనా వీరిని కదుపుతారా లేదా అన్నది ప్రశ్నార్థకమే.

రూ.1.60 కోట్లతో ఉడాయించిన
వ్యాపారికి రిమాండ్

- శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

గుడ్లవల్లేరు, జూలై 25 : బంగారు ఆభరణాలు చేసి ఇస్తానని, 150 కిలోల వెండి దిమ్మెలు ఇస్తామని నమ్మజూపి రూ1.60కోట్లతో ఉడాయించిన స్వర్ణ వ్యాపారిని మంగళవారం ఉదయం తెలంగాణ రాష్ట్రంలోని శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదే రోజు సాయంత్రం గుడివాడ కోర్టుకు హాజరుపరచగా నిందితుడికి రిమాండ్ విధించిన ఉదంతమిది. గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కూరాడ, పెసరమిల్లి గ్రామాలకు చెందిన శాయిన వెంకటేశ్వరరావు(నాని), అతని సోదరుడు కమ్మిలి రాధాకృష్ణల కుటుంబాలకు మచిలీపట్నంకు చెందిన బంగారు ఆభరణాల వ్యాపారి ఉదత్తు మధుసూదనరావు అతడి కొడుకు, సోదరులు నమ్మకంగా గత కొంతకాలంగా బంగారు వస్తువులు చేసి ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో బంగారు ఆభరణాలు, 70, 80 కేజీల వెండి దిమ్మెలు ఇస్తానని నమ్మజూపి బాధితుల వద్ద నుంచి పలు దఫాలుగా రూ 1.60 కోట్ల ను తీసుకున్నారు. నెలలు గడిచినా వస్తువులు చేసి ఇవ్వకపోగా.. ఫోన్‌లోనూ స్పందించడంలేదు. ఉదత్తు మధుసూదనరావుచే మోసపోయామని గ్రహించిన బాధితులు గత ఏడాది ఏప్రిల్ 22న గుడ్లవల్లేరు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ ప్రారంభించారు. నిందితుడు సింగపూర్‌లో ఉన్నట్టు తెలుసుకున్న పోలీసులు అంతర్జాతీయ విమానాశ్రయాల ఏవియేషన్ అధికారులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. మంగళవారం ఉదయం తెలంగాణ రాష్ట్రం శంషాబాద్ విమానాశ్రయం వద్ద మధుసూదనరావును పోలీసులు అదుపులోకి తీసుకొని ఆదేరోజు సాయంత్రం గుడివాడ కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు.



వివరాలు తెలుపుతున్న ఎస్ఐ సత్యనారాయణ



వివరాలు తెలుపుతున్న అధికారులు



ఇసుక డంప్ వద్ద ఆధారాలు పరిశీలిస్తున్న సీఐ

అనుమంచిపల్లి ఇసుక యార్డులో
ఎస్ఈబీ తనిఖీలు

- అధికారుల అదుపులో ప్రైవేటు వ్యక్తి..
- రెండు ట్రాక్టర్ల సీజ్



ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు

జగ్గయ్యపేట రూరల్, జూలై 25 : అనుమంచిపల్లి ఇసుక యార్డు నుంచి ఒకే వే బిల్లుపై రెండు ట్రాక్టర్‌లలో 10 టన్నుల ఇసుక తరలిస్తున్న వాహనాలతో పాటు డంప్ వద్ద ప్రైవేట్ వ్యక్తిని గురువారం ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ భార్గవ్, సీఐ మణికంఠరెడ్డి అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించిన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. ప్రభుత్వం ఉచిత ఇసుకకు సంబంధించి ఆయా శాఖల అధికారులను రెండు షిఫ్టులుగా విధులు నిర్వహించేందుకు నియమించింది. డంప్‌పై కన్నేసిన అక్రమార్కుల వత్తిడితో సింహభాగం అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి. సైదాఅనే ప్రైవేట్ వ్యక్తిని అక్కడ ఉంచినట్టు అధికారులు తెలిపారు. ఇసుక కోసం వచ్చే వాహనదారులు ప్రభుత్వ ఖజానాకు సొమ్ము చెల్లించి రశీదు చూపిన తరువాత వే బిల్లు అందించాల్సి ఉంటుంది. ప్రైవేట్ వ్యక్తి తన సెల్‌ఫోన్‌కు ఫోన్‌పే ద్వారా డబ్బులు వేయించి రశీదులు ఇస్తున్నాడని ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిపారు. దీనిపై విచారిస్తున్నామని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంటుందన్నారు.

డంప్‌లో సిబ్బందిపై అక్రమార్కుల పెత్తనం!

వైసీపీ ప్రభుత్వ హయాంలో అంటకాగిన వ్యక్తులు ఇసుక డంప్‌పైనా పెత్తనం చెలాయిస్తున్నారనే వార్తలు స్థానికంగా హల్‌చల్ చేస్తున్నాయి. ఉద్యోగులను సైతం బెదిరించి ప్రైవేట్ వ్యక్తిని ఏర్పాటు చేసి డబ్బులు వసూలు చేయడాన్ని ఎస్ఈబీ అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకోవటం, నందిగామకు చెందిన వ్యక్తి ఎస్కవేటర్‌ను వినియోగిస్తుండటం వాదనలకు బలం చేకూరుతోంది. జిల్లా స్థాయి అధికారులు దృష్టి సారించకపోవటంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక యార్డు వద్ద అవకతవకలపై సమాచారంతో సీఐ జానకిరామ్ విచారణ చేశారు. ఆయా శాఖలకు చెందిన ఉద్యోగులు విధులకు హాజరుపై విచారణ చేశారు. స్థానిక వీఆర్వో పుల్లారావు ద్వారా సమాచారం సేకరించారు. విచారణ అనంతరం పూర్తి సమాచారం అందిస్తామని సీఐ తెలిపారు.

నరసాపురం - మచిలీపట్నం కొత్త రైల్వేలైన్ సర్వేకు గ్రీన్‌సిగ్నల్

- కోటిపల్లి ప్రాజెక్టుకు రూ.300 కోట్లు
- రైల్వే బడ్జెట్‌లో తీర ప్రాంతానికి వరం



నరసాపురం/మచిలీపట్నం, జూలై 25 : సముద్ర తీరం వెంబడి కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బ్రిటీష్ హయాం నుంచి ప్రతిపాదనలకే పరిమితమైన నరసాపురం-మచిలీపట్నం మధ్య లైన్‌కు సర్వే చేయాలని నిర్ణయించింది. మంగళవారం సమర్పించిన 2024-25 కేంద్ర బడ్జెట్‌లో ఈ మేరకు ప్రతిపాదనలు చేసినట్టు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ పనులు పూర్తయితే నరసాపురం పెద్ద జంక్షన్‌గా మారనుంది. చివరి స్టేషన్ అన్న పేరు నుంచి తప్పుకోనుంది. ఇప్పటికే నరసాపురం నుంచి భీమవరం మీదుగా నిడదవోలు, గుంటూరు, విజయవాడ, నాగర్‌సోల్, బెంగళూరు, హుబ్లీ, ధర్మవరం, లింగంపల్లి, హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. మరోవైపు కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ పూర్తయితే నరసాపురం జంక్షన్ అవుతుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లావాసులు స్వాగతిస్తున్నారు. మచిలీపట్నం-నరసాపురం మార్గాన్ని రైల్వే రూట్‌లో కలపాలని బ్రిటిష్ హయాంలోనే ప్రతిపాదించారు. దీనిని పట్టాలెక్కించేందుకు మోదీ సర్కార్ ఫైనల్ లోకేషన్ సర్వేకు ఆదేశించింది. 69 కిలోమీటర్ల మేర కొత్త లైన్‌కు పలుచోట్ల ఉప్పుటేర్లపై వంతెనలు వేయాల్సి ఉంది. ఈ కారణంగా భారీ వ్యయం అవుతుందని అప్పట్లో ఈ ప్రతిపాదనను పెండింగ్ పెట్టారు. ప్రస్తుతం రైలులో మచిలీపట్నం వెళ్లాలంటే గుడివాడ వెళ్లి అక్కడి నుంచి రైలు మారాలి. అదే నరసాపురం నుంచి మచిలీపట్నం పూర్తయితే మొగల్తూరు, బంటుమిల్లి మీదుగా వెళ్ల వచ్చు. దీనివల్ల కోస్తా తీరం వెంబడి రైలు మార్గం ఏర్పడుతుంది. ఇప్పటికే కోటిపల్లి రైల్వేలైన్ వల్ల కాకినాడ నుంచి నరసాపురం వరకు రైలు మార్గం ఏర్పడింది. ఇటు మచిలీపట్నం పూర్తిచేస్తే సముద్ర తీరం వెంబడి రైలు కూత వినిపిస్తుంది. ప్రస్తుతం ఈ బడ్జెట్‌లో సర్వే పనులు చేపడుతున్నట్టు రైల్వే మంత్రి ప్రకటించారు. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే నరసాపురం స్టేషన్ పెద్ద జంక్షన్‌గా మారడంతోపాటు చివరి స్టేషన్ అన్న మార్క్ నుంచి తొలగనుంది.

కోటిపల్లికి రూ.300 కోట్లు..

ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించిన రైల్వే బడ్జెట్‌లో కోటిపల్లి రైల్వేలైన్‌కు రూ.300 కోట్లు కేటాయించారు. ఈ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి ప్రకటించారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌ల్లో రూ.1,150 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం రూ.300 కోట్లతో రూ.1,450 కోట్లకు చేరింది. ఈ నిధులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 25 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు రాష్ట్రం ఇచ్చిన వాటా మొత్తం రూ.50 కోట్లు మాత్రమే అది కూడా 2019కి ముందు. గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఈ ప్రాజెక్టుకు కేటాయించలేదు. ఈ కారణంగా పనులు ముందుకు సాగలేదు. 51 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ కొత్త రైల్వేలైన్ వల్ల కోనసీమ జిల్లాలోని అమలాపురం, రాజోలుకు రైలు మార్గం ఏర్పడనుంది. దీంతోపాటు విశాఖ, రాజమండ్రి మధ్య మెయిన్‌లైన్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పడనుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టులో మూడు భారీ వంతెనలు చివరి దశకు చేరుకున్నాయి. భూసేకరణ కూడా 75 శాతం పూర్తయింది. నిధులు పూర్తి స్థాయిలో ఉంటే ట్రాక్ పనులు వేగవంతం కానున్నాయి.

విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో
5 నుంచి భారీగా రైళ్ల రద్దు

- జాబితాలో తిరుమల, శాతవాహన, పినాకిని ఎక్స్‌ప్రెస్‌లు
- మూడో లైన్ నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో నిర్ణయం
- 12 వరకు 38 రైళ్లు దారి మళ్లింపు

విజయవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ-గూడూరు మూడో లైన్ పనుల్లో భాగంగా విజయవాడ-న్యూ వెస్ట్ బ్లాక్ హట్ మధ్య ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల రీత్యా ఆగస్టు 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో భారీగా రైళ్లను రద్దు చేశారు. డివిజన్ మీదుగా వెళ్లే 37 రైళ్లను రద్దు చేయడంతో పాటు, మరో 38 రైళ్లను దారి మళ్లించారు. రద్దు చేసిన రైళ్లలో విజయవాడ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే శాతవాహన (12713-14) ఎక్స్‌ప్రెస్, హుబ్బళ్లి - విజయవాడ మధ్య నడిచే (17329-30) ఎక్స్‌ప్రెస్, కడప-విశాఖపట్నం (17487-88) తిరుమల ఎక్స్‌ప్రెస్, విజయవాడ-చెన్నై (12711) పినాకిని, చెన్నై సెంట్రల్-విజయవాడ (12077-78) జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ సహా పలు రైళ్లు ఉన్నాయి.

దారి మళ్లించిన రైళ్ల వివరాలు

విశాఖపట్నం-సికింద్రాబాద్ (12739), సికింద్రాబాద్-విశాఖపట్నం (12740), విశాఖపట్నం-గాంధీనగర్ (20803), గాంధీనగర్-విశాఖపట్నం (20804), పూరి-ఓఖా (20819), ఓఖా-పూరి (20820), నిజాముద్దీన్- విశాఖపట్నం(12804), ఛత్రపతి శివాజీ టెర్మినల్-భువనేశ్వర్ (11019), భువనేశ్వర్ -ఛత్రపతి శివాజీ టెర్మినల్ (11020), యశ్వంత్‌పూర్-టాటా (18112), టాటా-యశ్వంత్‌పూర్ (18111), హైదరాబాద్-షాలిమార్ (18046), షిర్డీసాయినగర్-కాకినాడ పోర్టు (17205), కాకినాడ పోర్ట్-షిర్డీసాయినగర్ (17206), విశాఖపట్నం-షిర్డీసాయినగర్ (18503), షిర్డీసాయినగర్-విశాఖపట్నం (18504), విశాఖపట్నం-న్యూఢిల్లీ (20805), న్యూఢిల్లీ-విశాఖపట్నం(20806), విశాఖపట్నం-హైదరాబాద్ (12727), హైదరాబాద్-విశాఖపట్నం (12728), షాలిమార్-హైదరాబాద్ (18045), విశాఖపట్నం-నిజామాబాద్ (12803), మచిలీపట్నం-షిర్డీసాయినగర్(17208), షిర్డీ సాయినగర్-మచిలీపట్నం (17207), నర్సాపూర్-నాగర్‌సోల్ (12787), నాగర్‌సోల్-నర్సాపూర్ (12788), మచిలీపట్నం-బీదర్ (12749), బీదర్-మచిలీపట్నం (12750), విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినల్ (18519), లోకమాన్యతిలక్ టెర్మినల్-విశాఖపట్నం (18520), హైదరాబాద్-తాంబరం (12760).



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

భూ సమస్యలు పరిష్కరించండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయ విస్తరణలో భూమి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. విమానాశ్రయ విస్తరణకు రైతుల నుంచి సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లింపు, సీఆర్‌డీఏలో ప్లాట్‌ల కేటాయింపు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం, వార్షిక కౌలు, సీఆర్‌డీఏలో ప్లాట్‌ల కేటాయింపు కోసం సీఆర్‌డీఏకు లేఖలు రాయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. విమానాశ్రయ సరిహద్దు వెంబడి జరుగుతున్న నిర్మాణాలతో భద్రతాపరమైన ఇబ్బందులు లేకుండా చూడాలని, విమానాశ్రయం పక్కనే ఉన్న భూముల్లో వివిధ పంటలు సాగు చేస్తుండటంతో పక్షుల సంచారం అధికంగా ఉండి విమాన రాకపోకలకు అంతరాయంగా ఉందని, ఈ అంశంపైనా అధికారులు పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జేసీ గీతాంజలిశర్మ డీఆర్వో కె.చంద్రశేఖరరావు, గుడివాడ ఆర్డీవో పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విమానాశ్రయ అభివృద్ధి పనులు ఎప్పటికి పూర్తి చేస్తారు

- పార్లమెంట్ సమావేశాల్లో బాలశౌరి ప్రశ్న

మచిలీపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయ అభివృద్ధి పనులు 2023 మార్చి నాటికే పూర్తి కావాల్సి ఉండగా.. ఎందుకు ఆలస్యం జరిగిందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి శుక్రవారం పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్నించారు. 2020లో విమానాశ్రయం పనులకు అమోదం తెలిపారని, పనులకు సంబంధించిన వ్యయాన్ని పెంచితే వివరాలను తెలియజేయాలని ఆయన కోరారు. విమానాశ్రయ అభివృద్ధికోసం రూ.347కోట్లను కేటాయించినా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఎందుకు ఖర్చు చేయలేదని ప్రశ్నించారు. పనుల జాప్యానికి కారణాలు, ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియజేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు సమాధానమిస్తూ గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి చేసేందుకు రూ.611.80 కోట్లతో అంచనాలు రూపొందించి 2020జూన్‌లో ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. జూన్ 2024నాటికి ప్రాజెక్టు పనులు 48.5శాతం పూర్తయ్యాయన్నారు. ఇప్పటివరకు రూ.279.93 కోట్లతో పనులు చేసినట్టు తెలిపారు. పర్యావరణ అనుమతులు రావడంలో ఆలస్యం, కొవిడ్-19, తీరప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పనుల్లో జాప్యం జరిగిందన్నారు. 2025 జూన్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు మంత్రి తెలిపారు.


ఇద్దరు వీఆర్వోలపై వేటు

మైలవరం : మైలవరం మండలం చంద్రాల వీఆర్వో ఇమ్మానుయేలు, గణపవరం వీఆర్వో షేక్ ఈసూబ్‌లను సెస్పెండ్ చేస్తూ గురువారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు తహసీల్దార్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. మట్టి అక్రమ నిల్వలకు సంబంధించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడంతో వారిని సస్పెండ్ చేసినట్టు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల లారీ, కారు ఢీ

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు

ఇబ్రహీంపట్నం, జూలై 25 : గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న లారీని వేగంగా వస్తున్న స్కార్పియో కారు ఢీ కొట్టిన ఘటనలో కారులో ఉన్న ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ప్రమాదం 30 నంబరు జాతీయ రహదారిపై కొండపల్లి ఐడీఏ హెచ్‌సీపీఎస్ గ్యాస్ ఫిల్లింగ్ సంస్థ వద్ద గురువారం జరిగింది. విజయవాడ నగరానికి చెందిన చెన్నుపాటి సాంబశివరావు (58) గుమస్తాతో కలిసి స్కార్పియో కారులో మైలవరం వైపు వెళుతుండగా అదే సమయంలో కంపెనీ వద్ద గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న లారీ రోడ్డు దాటుతోంది. వేగంగా వస్తున్న కారు లారీ వెనుకభాగంలో ఢీ కొట్టింది. ప్రమాదంలో సాంబశివరావు మృతి చెందగా గుమస్తాకు గాయాలయ్యాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడి అవశేషాలను సేకరిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో కృష్ణమాన్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

గుంటుపల్లి మామిడి తోటలో నేపాల్ వ్యక్తి కళేబరం!

ఇబ్రహీంపట్నం, జూలై 25 : గుంటుపల్లి పంచాయతీ పరిధిలోని మామిడి తోటలో నేపాల్ దేశస్థుడి కళేబరాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నేపాల్ దేశానికి చెందిన కృష్ణమాన్‌కుమార్ (46) కోయంబత్తూరు సోనాలి అల్యూమినియం ఫ్యాక్టరీలో గత పదేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది నేపాల్ వెళ్లి ఏప్రిల్ 24న తిరిగి స్నేహితులైన రాజ్‌కుమార్, కంచన్‌కుమార్, సంజనకుమార్‌లతో కోయంబత్తూర్ వెళుతూ మార్గమధ్యలో విజయవాడ స్టేషన్‌లో కృష్ణమాన్ కుమార్ దిగాడు. అక్కడ రైలు మిస్ కావడంతో మే 25న స్నేహితులకు ఫోన్ చేశాడు. ఆ తర్వాత అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. సూరాయిపాలెం గ్రామానికి చెందిన మామిడి తోట యజమాని చలపతిరావు గురువారం తోటలో పిచ్చి మొక్కలు తొలగిస్తుండగా మృత కళేబరం కనిపించింది. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పక్కనే ఫోన్ లభించడంతో మృతుడి వివరాలు సేకరించారు. నేపాల్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. తోట యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

ఎంపీటీసీ సభ్యులకు గౌరవవేతనం చెల్లించాలి

గన్నవరం, జూలై 25: ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం విడుదల చేయాలని గన్నవరం ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఏడాది నుంచి ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం రావటం లేదని ఆయన పేర్కొన్నారు. అధికారులకు ప్రతి నెలా వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని, మండలంలో 25మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారని, వారిలో ఒక్కొక్కరికీ నెలకు రూ.3వేల చొప్పున ఏడాదికి రూ.36వేలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రతి బోర్డు మీటింగ్‌లో గౌరవ వేతనంపై ప్రస్తావిస్తున్నా బడ్జెట్ లేదని అధికారులు చెబుతున్నారని రంగారావు తెలిపారు.



శాకంబరీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

శాకంబరీదేవిగా పేరంటాలమ్మ

గుణదల, జూలై 25: రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో అమ్మవారు గురువారం సాయంత్రం భక్తులకు శాకంబరీదేవిగా దర్శనమిచ్చింది. ఏటా ఆషాఢమాసంలో వెంకమ్మ పేరంటాలమ్మను శాకంబరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ ఈవో పి.లోకేశ్వరి తెలిపారు. శుక్రవారం ఉదయం కూడా భక్తులకు అమ్మవారు శాకంబరీదేవిగా దర్శనమిస్తారని ఆమె తెలిపారు. ఆదివారం భక్తులకు కూరగాయలు ప్రసాదంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

మినీ గోకులం షెడ్లకు సబ్సిడీ రుణాలు

హనుమాన్‌జంక్షన్, జూలై 25: పశుపోషణ చేసుకునే రైతులకు ప్రభుత్వం మినీగోకులం పథకం ద్వారా షెడ్లను నిర్మించుకోవడానికి సబ్సిడీ రుణాలు అందిస్తోందని బాపులపాడు పశుసంవర్థక శాఖ ఏడీ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సన్న, చిన్న,పేద రైతులు తాము పెంచుకుంటున్న పాడి పశువులకు సరైన వసతి కల్పించలేకపోతున్నారని, దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందిస్తోందని తెలిపారు. రెండు పశువులకు రూ.లక్షన్నర, నాలుగు ఉన్న వారికి రూ.1.85 లక్షలు, ఆరు పశువులకు రూ.2.30 లక్షలు యూనిట్‌కు మంజూరు చేస్తోందన్నారు. యూనిట్ ఖర్చు మొత్తంలో 10శాతం రైతులు సమకూర్చుకోవాల్సి ఉంటుందన్నారు. మిగిలిన సొమ్మును ఉపాధి హామీ పథకం ద్వారా విడుదల చేస్తోందన్నారు. రేషన్ కార్డు కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, సన్నచిన్న కారు రైతులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. షెడ్ ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకు అకౌంట్ కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో పశువైద్యాధికారుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆటోను ఢీకొన్న కారు

● ముగ్గురికి తీవ్ర గాయాలు

హనుమాన్‌జంక్షన్, జూలై 25: గుడివాడ రోడ్డులో ఆరుగొలను వద్ద బుధవారం రాత్రి ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌జంక్షన్ నుంచి వెళుతున్న (ఏపీ 20ఏఈ 1115) కారు ఆరుగొలను వద్ద ఎదురుగా వస్తున్న ఓగిరాల గ్రామానికి చెందిన ఆటోను ఢీకొంది. ఆటో డ్రైవర్ ఆకునూరి హరిబాబుతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న బిహార్‌కు చెందిన యువకులు ఇమ్రాన్, నిమ్మిద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గుడివాడ ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం వారిని తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై విచారణ

గన్నవరం, జూలై 25: ఎంఈవో కార్యాలయంలో పని చేసే పలువురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై గురువారం విచారణ జరిగింది. ఎన్నికల సమయంలో వైసీపీకి అనుకూలంగా పనిచేశారని టీడీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డీవైఈవో పద్మ రాణి, ఎంఈవోలు రామ్‌బాలసింగ్, కనక మహాలక్ష్మీతో విచారణకు కమిటీని వేశారు. దీంతో ఎంఈవో కార్యాలయంట కమిటీ విచారణ జరిపింది. రిపోర్టును కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపింది.

చిన ఓగిరాలలో తోటబడి

ఉయ్యూరు, జూలై 25: కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, రాష్ట్ర ఉద్యానశాఖ, మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం చిన ఓగిరాలలో తోటబడి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. దొండసాగులో మెళకువలు, సస్యరక్షణ చర్యలపై రైతులకు సస్యరక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు టి.ప్రేమరంజిత, ఒ.వీరబాబు, సురేష్ అవగాహన కల్పించారు. మండల ఉద్యాన అధికారి దేవిశ్రీ, ఏఈవో సునీల్, రైతులు మాధవరావు, శివాజీ, బాలాజీ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 25: "బండారుగూడెం గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదు. వర్షాలకు మురుగునీరు వర్షపునీటితో కలిసి ప్రధాన రహదారులపై ప్రవహిస్తోంది. అది ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తక్షణం పారిశుధ్య పనులు చేపట్టండి" అని పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి శ్రీనివాసరావుకు సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ గురువారం వినతిపత్రం అందజేశారు. డ్రెయినేజీ పూడికతీత పనులు చేయకపోవడంతో మురుగు పారక దోమలు పెరుగుతున్నాయని, ఇప్పటికే గ్రామస్థులు కొందరు వైరల్ జ్వరాల బారిన పడ్డారని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా తక్షణమే డ్రెయినేజీ పూడికతీత పనులతో పాటు ఫాగింగ్ తదితర పారిశుధ్య పనులను చేపట్టాలని కార్యదర్శిని కోరారు.



300 ఎకరాల వరి నీటిపాలు

నాట్లేసి పదిహేను రోజులు..పది రోజుల నుంచి ముంపులోనే

● కర్షకోడు పూడిక తీయకపోవడంతోనే మాకీ దుస్థితి

● పునాదిపాడు రైతుల ఆవేదన

కర్షకోడు ఎగదన్నడంతో పునాదిపాడులో నీటమునిగిన నాట్లేసిన వరి చేలు



పూడిక తీయకపోవడంతో అధ్వానంగా ఉన్న కర్షకోడు

కంకిపాడు: మండలంలోని పునాదిపాడు, గొల్లగూడెం, కోలవెన్ను, జగన్నాథపురం, మంతెన గ్రామాల పరిధిలోని 500 ఎకరాలకు మురుగు పోయేందుకు కర్షకోడు ఉపయోగపడుతోంది. అకాల వర్షాల కారణంగా నీట మునిగిన పొలాల్లోని మురుగు పోయేందుకు ఈ కోడే దిక్కు. ఐదేళ్లుగా కోడు పూడికతీత పనులను అధికారులు చేయలేదు. దీంతో పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీరు పోయే దారి లేక పునాదిపాడు గ్రామంలో కర్షకోడు నుంచి నీరు పంట పొలాల్లోకి ఎగదన్నింది. దీంతో నాట్లేసిన 300 ఎకరాల వరి నీట మునిగింది. నాట్లేసి పదిహేను రోజులైందని, పదిరోజుల నుంచి నీటిలోనే చేలు ఉన్నాయని, వ్యవసాయ, నీటిపారుల శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



కర్షకోడు వద్ద డ్రెయినేజీ ఏఈ కోసం ఎదురుచూస్తున్న పునాదిపాడు రైతులు

అధికారులు పట్టించుకోవడం లేదు

బోర్ల కింద ఎకరం వరి నాటు వేశా. పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అది నీట మునిగింది. వారం రోజులుగా పొలంలో నీరు పారుదల కాకపోవడంతో అది దెబ్బతింది. అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు.

-లోయ సత్యనారాయణ, రైతు, పునాదిపాడు

ఎకరాకు రూ. 12 వేలు ఖర్చు అయ్యింది

50 ఎకరాలు కౌలు చేస్తున్నా. దుక్కి దున్ని, నారు పోసి, నాటు వేసేంత వరకు ఎకరాకు రూ.12 వేలు ఖర్చు అయ్యింది. వర్షాల కారణంగా పెట్టిన పెట్టుబడి రూ. 12 వేలు నీట పాలైనట్టే. మళ్లీ మొదటి నుంచి నారు పెంచుకుని నాటు వేయాల్సిన దుస్థితి దాపురించింది.

-శ్రీనివాసరావు, రైతు, పునాదిపాడు

డ్రెయినేజీ ఏఈ కోసం పడిగాపులు

నాలుగైదు రోజులుగా డ్రెయినేజీ ఏఈ వస్తారేమోనని కర్షకోడు వద్దే పడిగాపులు కాస్తున్నాం. ఇదిగో వస్తున్నా..అదిగో వస్తున్నా అంటూ ఆయన కాలయాపన చేస్తున్నారు. కర్షకోడు పూడిక తీయించాలని ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

- సాదం బసవరావు, కౌలు రైతు, పునాదిపాడు



ముస్తాబాదలో నీట మునిగిన దక్షిణం వైపు పొలాలు

నాట్లేసిన 80 ఎకరాలు నీటిలోనే..

గన్నవరం: ముస్తాబాద దక్షిణం వైపు ఉన్న వరి చేలు నీట మునిగాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరంతా వరి పొలాల్లోకి చేరింది. ఆ నీటిని బయటకు తరలించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆ ప్రాంతంలో రైల్వే నిర్మాణ పనులు జరుగుతుండటంతో కొత్తగా రోడ్డు వేశారని దీంతో నీరు వెళ్లే మార్గం లేక నాట్లు వేసిన పొలాలు 80ఎకరాలు నీటమునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ అధికారులు నీట మునిగిన వరిని పరిశీలించలేదని తెలిపారు. అధికారులు వరిని పరిశీలించి సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

24 గంటలూ వైద్య సేవలందించాలి

● వైద్యులు, సిబ్బందికి డీఎంహెచ్‌వో ఆదేశం



కాటూరు పీహెచ్‌సీలో వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

ఉయ్యూరు, జూలై 25: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 24 గంటలు వైద్యసేవలందించేందుకు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని డీఎంహెచ్‌వో జి.గీతాబాయి ఆదేశించారు. కాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ వివరాలు పరిశీలించారు. ఇన్‌పేషెంట్లకు సరైన వైద్యం అందుతుందా లేదా అని ఆరాతీశారు. వైద్యులు, సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వర్తించాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాని ఆమె సూచించారు. 60 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకాలు వేయడం వలన మధుమేహం, టీబీ వ్యాధిగ్రస్తులకు కలిగే మేలు తెలియజేయాలని, లక్ష్యాన్ని చేరుకోవాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ వైద్యురాలు అనూష, ఎంపీహెచ్ ఈవో వి.నాగార్జునబాబు తదితరులు పాల్గొన్నారు.

కలవపాముల సర్పంచ్‌పై విచారణ

ఉయ్యూరు, జూలై 25: కలవపాముల సర్పంచ్‌పై ఆరోపణలు రావడంతో గుడివాడ డీఎల్పీవో సంపత్‌కుమారి, ఉయ్యూరు ఈవో పీఆర్డీ కిరణ్మయి గురువారం గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలో రోడ్డు వేయకుండా బిల్ చేశారని, పాత గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కూల్చేసి దాని రద్దు, ఇతర సామగ్రి అమ్ముకున్నారని, గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు పోతురాజు రామారావు మీకోసంలో జిల్లా అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో డీఎల్పీవో గ్రామంలో పర్యటించి రామారావు చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టారు. గ్రామ సచివాలయ కార్యాలయంలో సర్పంచ్ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శి లక్ష్మణరావు, వీఆర్వోను ఆమె విచారించారు. అధికారుల నుంచి రికార్డులు తీసుకోవాలని సూచించారు. విచారణ కొనసాగుతుందని రోడ్డుకు ఎంబుక్, రికార్డులు ఏఈ పీఆర్ నుంచి సేకరించాల్సి ఉందని డీఎల్పీవో తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

పెనమలూరు, జూలై 25: యనమలకుదురు ఎన్టీఆర్ గార్డెన్స్ వద్ద కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. వంద మందికి పైగా స్థానికులకు రక్తపోటు, మధుమేహం పరీక్షలను చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యులు నితిన్, దాశరథి, స్థానిక నాయకులు మొక్కపాటి శ్రీనివాస్, బలగం కొండ హాజరయ్యారు.

గంగానమ్మకు ఆషాఢ సారె

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 25: రంగన్నగూడెం, పెరికీడు వంతెన గ్రామాల్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంగానమ్మకు గురువారం ఆషాఢసారె సమర్పించారు. రామాలయంలో ఆషాఢసారెకు ప్రత్యేక పూజలు చేశాక, మహిళా కమిటీ సభ్యుల జైదుర్గ నామస్మరణతో మేళతాళాల మధ్య అమ్మవారికి పసుపు కుంకుమ, నూతన వస్త్రాలు, పండ్లు, పూలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. రంగన్నగూడెంలో గ్రామ కన్వీనర్ కొలుసు బలరాం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సబ్ డివిజన్ ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి పాల్గొన్నారు.



సారె తీసుకెళుతున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు



హనుమాన్‌జంక్షన్‌లో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త రమేశ్‌బాబు

జనసేనను బలోపేతం చేద్దాం

● క్రియాశీలక సభ్యులుగా నమోదు కండి: చలమలశెట్టి రమేశ్‌బాబు

హనుమాన్‌జంక్షన్, జూలై 25: ప్రతి కార్యకర్త క్రియాశీలక సభ్యత్వాన్ని తీసుకోవడం ద్వారా పవన్‌కల్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీని బలోపేతం చేద్దామని, ఆపార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం విజయవాడ రోడ్డులో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వడ్డి శివనాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. శిబిరాన్ని రమేశ్‌బాబు ప్రారంభించి మొదటి రశీదును అందజేశారు. రూ.500తో వార్షిక సభ్యత్వం తీసు కుంటే రూ.5లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. సింగవరపు సూర్యవతి, కట్టా నరేంద్ర, రేవిణిశెట్టి జితేంద్ర, వడ్డి అశోక్, వినయ్ పాల్గొన్నారు.



కానుమోలు ఆయుర్వేద ఆస్పత్రిలో మొక్కల ఔషధగుణాలను ఇటలీ బృందానికి వివరిస్తున్న డాక్టర్ వాహిని

ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 25: దీర్ఘకాల వ్యాధులను ఆయుర్వేద వైద్యంతో నయం చేయొచ్చని, సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయొచ్చని ఆయుర్వేద వైద్యురాలు వాహిని తెలిపారు. కానుమోలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను గురువారం ఇటలీలోని పాదువా విశ్వవిద్యాలయానికి చెందిన ఫెడ్రికారోసీ, నియోమీ, శామ్యూల్‌రైనా సందర్శించారు. ఆయుర్వేద వైద్యశాలలో ఇటీవల ప్రారంభించిన పంచకర్మ చికిత్సను చేయించుకున్నారు. ఆయుర్వేద వైద్యశాలలో పెంచుతున్న ఔషధ మొక్కలను వారికి చూపించి, వాటిలోని ఔషధ గుణాలు, ఆయుర్వేద వైద్యంలో వాటిని ఉపయోగించే తీరును డాక్టర్ వాహిని వివరించారు. బుద్ధవరం కేర్ అండ్ షేర్ సంస్థ డైరెక్టర్ స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాస్‌కు అభినందన

పెనమలూరు/కంకిపాడు, జూలై 25: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్‌కు ఆ పార్టీ బీసీ సెల్ పెనమలూరు నియోజకవర్గ అధ్యక్షుడు సంగెపు రంగారావు అభినందనలు తెలిపారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో పల్లాను కలిసి ఆయన సన్మానించారు. రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సంగెపు వెంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కొణతం సుబ్రహ్మణ్యం ఉన్నారు.



పల్లా శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సంగెపు రంగారావు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.80

కైకాల సత్యనారాయణకు కళాకారుల ఘననివాళి



గుడివాడ : నవరస నటనా సార్వభౌమ కైకాల సత్యనారాయణ జయంతిని కాపు సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గల కైకాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా సమితి అధ్యక్షుడు నరహరశెట్టి ప్రసాద్, కళాకారులు సంఘం పెద్దలు నెరుసు చింతయ్య, కాపు సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జీఈసీ ఆధ్వర్యంలో ఒలింపిక్ క్రీడా జ్యోతి ర్యాలీ

గుడ్లవల్లేరు : ఒలింపిక్ క్రీడల నేపథ్యంలో శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల (ఎస్ఆర్‌జీఈసీ) ఆధ్వర్యంలో క్రీడా జ్యోతి ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వద్ద ర్యాలీని ఎస్సై సత్యనారాయణ, తహసీల్దార్ సునీల్ ప్రారంభించారు. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి భారత క్రీడాకారుల విజయాన్ని కాంక్షిస్తూ నినాదాలు చేశారు. క్రీడాజ్యోతిని యానియన్, భారతీయ స్టేట్ బ్యాంక్ సిబ్బంది, కళాశాలల అధ్యాపకులు క్రీడా జ్యోతిని పట్టుకుని జీఈసీకి రాగా, ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్‌అఖండ జ్యోతిని వెలిగించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, యాజమాన్య సలహాదారు డాక్టర్ పొట్లూరి రవీంద్రబాబు, డాక్టర్ జి.వి.ఎస్.ఎన్. ఆర్.వి ప్రసాద్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ ఎం.శివశంకర్ పాల్గొన్నారు.



కార్గిల్ అమర వీరులకు నివాళిగా ర్యాలీ

మచిలీపట్నం టౌన్ : కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలను మరువలేమని టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నాగలింగం అయోధ్య రామయ్య అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కోనేరుసెంటర్ నుంచి నవకళ సెంటర్ వరకు బీజేవైఎం ఆధ్వర్యంలో ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. నాయకులు పంతం గజేంద్ర, గాంధీ, పత్తిపాటి రమణ, శ్రీనివాస్, న్యాయ వాది కూనపరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఎం నిరసన

చల్లపల్లి : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటరులో గురువారం నిరసన ప్రదర్శన జరిగింది. ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణం, పోలవరం, విశాఖ ఉక్కు, విభజన హామీల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి మాటలతోనే సరిపెట్టిందని నేతలు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, సీఐటీ యూ మండల కార్యదర్శి ఎండి.కరీముల్లా, ఆటోకార్మిక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్పా నిపుణుల బృందం గుడివాడ సందర్శన



గుడివాడ : విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా) నిపుణుల బృందం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆహ్వానం మేరకు గుడివాడ పట్టణంలో గురువారం పర్యటించింది. తొలుత ఆర్టీసీ బస్టాండు, రామబ్రహ్మం పార్కు, పురపాలక సంఘ కార్యాలయ సెంటర్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులతో నిపుణుల బృందం పర్యటించారు. పురపాలక సంఘ భవనాలు, నాగవరప్పాడు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఉన్న సెంట్రల్ డివైడర్‌పై నిపుణుల బృందం సర్వే నిర్వహించింది. పట్టణ సుందరీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై బృంద సభ్యులు మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యంతో చర్చించారు. పట్టణ మ్యాప్‌ను పరిశీలించారు. మున్సిపల్ ఇంజినీర్ విజయదుర్గ, డి.ఇ ప్రవీణ్, టిడిపి నాయకులు పెద్దు శ్రీకాంత్, ఆర్కిటెక్చర్ బృంద సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ రహిత ఆంధ్రప్రదేశ్‌గా చేద్దాం

మచిలీపట్నం టౌన్ : క్షయ రహిత ఆంధ్రప్రదేశ్‌ను చేయడానికి సచివా లయాల్లోని అన్ని శాఖలను వినియోగించుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ టి. రమేష్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఏఎన్ఎంలు, సచివాలయ కార్యదర్శులతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. రమేష్ మాట్లాడుతూ, అడల్ట్ బీసీజీ టీకాను 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ వేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి గీతాబాయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అదనపు జిల్లా వైద్యాధికారి వెంకట్రావు, మలేరియా శాఖాధికారి బి. రామారావు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుతో ఆనందోత్సాహాలు

• సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



మచిలీపట్నం, తోట్లవల్లూరులో చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ శ్రేణులు

మచిలీపట్నం టౌన్, జూలై 25 : కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేయడంతో టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ తదితరులు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ లీగల్ సెల్ నాయకులు లంకే వెంకటేశ్వరరావు, పుప్పాల ప్రసాద్ మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై న్యాయవాదు లు నిరాహార దీక్షతో సహా ఉద్యమాలు చేశారన్నారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మాదివాడ వెంకట నరసింహారావు, టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్, టీడీపీ నాయకులు పిప్పళ్ళ కాంతారావు, తూమాటి బసవ శంకరరావు, గండికోట అంజిబాబు, చిన్నం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** హెల్త్ యూనివర్సిటీ పేరును ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీగా మారుస్తూ అసెంబ్లీలో ఆమోదించినందుకు, అమరావతి నిర్మాణానికి కేంద్రం నుంచి రూ.15 వేల కోట్లు మంజూరు చేయించినందుకుకృతజ్ఞతలు తెలియజేస్తూ తోట్లవల్లూరు బస్టాండు సెంటర్‌లో గురువారం సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నెక్కలపూడి మురళీ, గొరిపర్తి గోపయ్య, వల్లూరు రమేష్, రాంబాబు, కొల్లా సాంబశివరావు, కూసం సురేష్‌రెడ్డి, పంచాయితీ సభ్యురాలు జి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బోటు ప్రమాదంలో జనసేన నాయకుడు మోకా నాగు మృతి



మచిలీపట్నం టౌన్, జూలై 25 : బందరు మండలం పోలాటితిప్ప గ్రామానికి చెందిన మత్స్యకార జనసేన నాయకుడు బోటు ప్రమాదంలో మృతి చెందాడు. చిన్న పడవపై బుధవారం చేపల వేటకు వెళ్లిన మోకా నాగు (45) పడవ ప్రమాదంలో మృతి చెందాడు. నాగు మృత దేహం గిలకలదిండి మెరైన్ పోలీసు స్టేషన్ ఎదురుగా సముద్రం పాయ వద్దకు కొట్టుకు వచ్చింది. నాగు భౌతిక కాయాన్ని మెరైన్ పోలీసులు గుర్తించారు. నాగుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాగు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, నగర జనసేన అధ్యక్షుడు గడ్డం రాజు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకే నారాయణ ప్రసాద్, పోలాటితిప్ప సర్పంచ్ మోకా రాజు, పృథ్వీ, సాయి తదితరులునాగు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నాగు భార్య లక్ష్మిని పరామర్శించారు. సాయం అందిస్తామన్నారు.

హామీ నెరవేర్చిన రామకృష్ణ

స్థానిక 43వ డివిజన్‌లో మురుగు సమస్యకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పరిష్కారం చూపారు. సొంత నిధులతో రోడ్డుపై మురుగు తొలగేలా ర్యాంపుల నిర్మాణం చేపట్టారు. నాయకులు చలమలశెట్టి శ్రీనివాస్, అక్కిశెట్టి ఉదయ్ రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. గడ్డం రాజు, గణేష్, రాంబాబు, రమేష్, శ్రీనివాసు, పృథ్వి, వడ్డి హరిసాయి పాల్గొన్నారు.



30 మంది జనసేనలో చేరిక

గుడివాడ : నియోజకవర్గ జనసేన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ సమక్షంలో సగళ్ళ సత్యనారాయణ, పడాల పూర్ణ, సుంకర వెంకట్ ఆధ్వర్యంలో 30 మంది జనసేన పార్టీలో చేరారు. మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, బుడమ రాజు, సాయి పవన్, వెంకటేష్ పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతులకు కృషి

మోపిదేవి : మోపిదేవి బీసీ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులకు కృషి చేస్తానని ఉమ్మడి కృష్ణా జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు తెలిపారు. ఆశ్రమ పాఠ శాల, వసతిగృహాన్ని గురువారం ఆయన సందర్శించారు. టాయిలెట్లు, అదనపు గదులు నిర్మించాల్సిందిగా హాస్టల్ వార్డెన్ లంకేశ్వరరావు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. డైనింగ్ హాలు, టాయి లెట్ల నిర్మాణం, అదనపు తరగతి గదులు, ఇన్వెర్టర్‌కు త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినట్లు వార్డెన్ తెలిపారు.



వ్యవసాయ విద్యార్థులు కేవీకే సందర్శన

ఘంటసాల : విద్యా ప్రణాళికలో భాగంగా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాన్ని బాపట్ల వ్యవసాయ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు గురువారం సందర్శించారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత కృషి విజ్ఞాన కేంద్రం విధులు, జిల్లాలో వివిధ పంటల సాగు, రైతులకు శిక్షణా కార్యక్రమాలు, ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, పోషకాహారంలో భాగంగా చిరు ధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు భూసార పరీక్ష కేంద్రాన్ని, జీవ నియంత్రణ ప్రయోగశాల, షేడ్ నెట్‌లో కూరగాయలు, నారు పెంపకం, వర్మికంపోస్ట్ తయారీ తదితరాలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు మంజువాణి, రేవతి, యశ్వంత్ కుమార్, కృష్ణవేణి, బాపట్ల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 111 మంది ఎంపిక

పెడన : విజయానంద డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 229 మంది అభ్యర్థులు హాజరు కాగా వీరిలో 111 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తొమ్మిది కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు, కళాశాల కార్యదర్శి జ్యోతిరాజు, డైరెక్టర్లు ఎం. శ్రీనివాస్, ఉమ్మిటి విద్యాధర్, నాగేశ్వరరావు, కె. సొల్యూషన్స్ అధినేత కూరపాటి అరవిందకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ

ఘంటసాల : ఘంటసాల బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి గ్రూపు సభ్యులు, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు ఆషాఢ సారెను గురువారం సమర్పించారు. గెల్లి వెంకట సత్యకుమారి, చుండూరి ప్రభావతి, సంకా ఉష ఆధ్వర్యంలో మహిళలు పూలు, పండ్లు, స్వీట్లు, అమ్మ వారికి చీరలు, గాజులు, పసుపు, కుంకుమ తీసుకుని పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి పెన్నేరమ్మకు సమర్పించారు. బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారికి సారెను సమర్పించారు. గెల్లి శ్రీనివాస్, చుండూరి అశోక్ కుమార్, గెల్లి రాధాకృష్ణ, గెల్లి మురళీకృష్ణ, గెల్లి చలపతి తదిరతులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** గుడ్లవల్లేరు రమా సహిత సత్య నారా యణ స్వామి ఆలయంలో రమాదేవి అమ్మవారికి నిత్య విష్ణు సహస్రనామ పారాయణ అనంతరం భక్తులు ఆషాఢ సారె సమర్పించారు.

శాకంబరీగా గంగానమ్మ



గుడివాడ : మేదర్‌బజారులో గంగానమ్మకు గురువారం శాకంబరీ ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పండ్లు, కాయగూరలు, ఆకుకూరల అలంకరణతో అమ్మవారు కనువిందు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వీఆర్వో దుర్మరణం

గుడివాడ రూరల్, జూలై 25 : బొమ్ములూరు వద్ద రహదారిపై బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని వీఆర్వో దుర్మరణం చెందినట్లు రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మీ నరసింహమూర్తి గురువారం తెలిపారు. గుడివాడ పట్టణానికి చెందిన ఏ.ప్రవీణ్ (35) తాడేపల్లి వీఆర్వోగా పని చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై గుడివాడ నుంచి మచిలీపట్నం వెళ్తుండగా బొమ్ములూరు వద్ద బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహం ఛిద్రమై ఉందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మీ నరసింహమూర్తి తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

నాగాయలంక : ఆస్తి వివాదం సందర్భంగా ఏటిమొగలో అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. తిరుమలశెట్టి వెంకట శేషగిరిరావు, అతని సోదరుడు జయపాలనకు ఐదు సెంట్ల పోరంబోకు స్థలం విషయంలో వివాదం ఉంది. గ్రామ పెద్దలతో మాట్లాడి స్థలం వివాదాన్ని బుధవారం పరిష్కరించుకుందామనుకున్నారు. ఆ సమయానికి గ్రామ పెద్దలు అందుబాటులో లేకపోవటంతో వాయిదా పడింది. బుధవారం రాత్రి 11.45 నిముషాల సమయంలో శేషగిరిరావు బంధువులు తిరుమల శెట్టి ప్రవీణ్ కుమార్, కొప్పనాతి సాయి, మరో ముగ్గురు తిరుమలశెట్టి జయపాలన, అతని కుమారుడు వంశీ కుమార్‌పై దాడి చేశారు. గాయపడిన వారిద్దరినీ 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు.

డయల్ యువర్ డీఎం నేడు

అవనిగడ్డ : డయల్ యువర్ డీఎం ఈనెల 26వ తేదీ 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డీఎం కె.హనుమంతరావు తెలియజేశారు. సలహాలు 9959225466 కు ఫోన్ చేయాల్సిందిగా కోరారు.

ప్రకటన

నా క్లయింటు తెలంగాణ రాష్ట్రం, ఎల్లారెడ్డిగూడ, ఖైరతాబాద్, హైద్రాబాద్ కాపురస్తులు కూరాడ వెంకట సుబ్బారావు గారి కుమారుడు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు గారు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు యీ దిగువ షెడ్యూలులో చూపబడిన స్థిరాస్తిని ది.05-02-1987వ తేదీన డాక్యుమెంటు నెం. 527/1987ద్వారా కో-ఆపరేటివ్ బ్యాంకు సొసైటీ, మచిలీపట్నం వారి వద్ద క్రయము పొంది రిజిష్టరు క్రయ దస్తావేజు పొందియున్నారు. సదరు క్రయ దస్తావేజు ఫోటోస్టాట్ నిమిత్తం చిలకలపూడి నుండి మచిలీపట్నం బయలుదేరి వస్తుండగా సదరు ఒరిజినల్ క్రయదస్తావేజు దారిలో ఎక్కడోజారి పడిపోయినది. ఎవ్వరికైనా సదరు దస్తావేజు దొరికిన యెడల యీ క్రింది అడ్రస్సుకు తెలియచేయగలరని, సదరు ఆస్తిపై ఎవ్వరైనా లావాదేవీలు జరిపిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
షెడ్యూలు:- కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్ రిజిష్ట్రారు వారి ఋలాకా మచిలీపట్నం చిలకలపూడిలో వార్డు నెం.20 R.S.No.377రు లో య.28.80ల్లలో ప్లాట్ నెం 55రు గల చ.846 2/3లు 2708-19 చ.మీ. స్థలమునకు హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం : ప్లాట్ నెం. C-56, పడమర : ప్లాట్‌నెం. C-54, ఉత్తరం : సొసైటీ రోడ్డు నెం.3.

Ch.V. ఫణి కేశవరావు, అడ్వకేటు,
ఈడేపల్లి, మచిలీపట్నం. Cell No.9440978626

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

అవనిగడ్డ రూరల్ : ఫెయిత్ హోమ్ చర్చిలో 30 మందికి శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నా యుడు దుప్పట్లు పంపిణీ చేశారు. కేరీ, ఎబినేజర్, ఆదాం, బాబురావు, కొండలు పాల్గొన్నారు.

నరసాపురం ఎంపీడీవోకు పెడనలో నివాళి

పెడన రూరల్ : నరసాపురం ఎంపీడీవో వెంకట రమణ మృతి బాధాకరమని పెడన ఎంపీడీవో వి.రెడ్డయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వెంకట రమణ సంతాప సభ నిర్వహించారు. వెంకట రమణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈవోఆర్డీ జయరామ, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి, ప్రకాష్, కిషోర్, రమేష్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు వెంకట్రామయ్యకు నివాళి

ఘంటసాల : పెదప్రోలు గ్రామానికి చెం దిన టీడీపీ సీనియర్ నాయకుడు నాదెళ్ల వెంకట్రామయ్య సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, జడ్పీటీసీ సభ్యు డు మెడబలిమి మల్లికార్జునరావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకట్రామయ్య భార్య రమాదేవి సర్పంచ్‌గా ఉన్న కాలంలో గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశార న్నారు. ఎన్నికల్లో కూటమి విజయానికి వెంకట్రామయ్య విశేష కృషి చేశారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నాదెళ్ల చిత్రపటానికి నివాళులర్పించారు.

వాహనాలకు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

కోడూరు : ద్విచక్ర వాహనదారులకు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు ఉండాలని ఎస్సై పి.శిరీష అన్నారు. కోడూరు ప్రధాన సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, సి బుక్, ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించారు. పెండింగ్ చలానాలను కట్టించారు. బాలురకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని సూచించారు.



ఎమ్మెల్యే మండలి చొరవతో గుర్రపు డెక్క తొలగింపు

చల్లపల్లి : పుచ్చగడ్డ వద్ద చిల్లలవాగులో గుర్రపుడెక్క తొలగింపు పనులు డ్రైనేజీ శాఖ ఇన్‌చార్జి డీఈఈ పి.వెంకటేశ్వ రరావు పర్యవేక్షణలో చేపట్టారు. చిల్లలవాగులో తూటికాడ, గుర్రపుడెక్క తొలగించేందుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవతో నిధులు విడుదల కాగా, కలెక్టర్ డికె.బాలాజీ కృషితో షార్ట్ టెండరు పద్ధతిలో పనులు చేపట్టారు. దీంతో కొన్నిచోట్ల కూలీలు, యంత్రాల సహాయంతో గుర్రపుడెక్క తొలగింపు, మరికొన్ని చోట్ల స్ప్రేయింగ్ పనులు చేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సూచనలతో రైతులకు ఇబ్బందులు రాకుండా డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నం కాకుండా పనులు చేస్తామని డీఈఈ తెలిపారు.

కౌలుదారులకు సాగు హక్కు పత్రాలపై అవగాహన

ఘంటసాల : కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలపై కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు పంట సాగుదారు హక్కు పత్రం పొంది సాగు చేయటం క్షేమదాయకమన్నారు. మండలంలో 1040 కార్డులు మంజూరు చేశారు. కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలను అందజేశారు. కొత్తపల్లి వీఆర్వో పి.నాగమల్లేశ్వరి, వీఏఏ యూసఫ్ అలీ, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మీ సునంద పాల్గొన్నారు.

భూ రైతు చట్టం అమలు కోరుతూ పెడసనగల్లులో సంతకాల సేకరణ

కూచిపూడి : వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలు రైతు చట్టాన్ని రద్దు చేసి 2011 భూ రైతు చట్టాన్ని అమలు చేయాలని కౌలు రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొవ్వ మండలం పెడసనగల్లు గ్రామంలో ఈ విషయమై సంతకాల సేకరణ చేపట్టారు. నారాయణరావు మాట్లాడుతూ భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు.నాంచారయ్య, కృష్ణారావు, మేరుగు విష్ణు, ప్రవీణ్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

గురజాడ(పమిడిముక్కల) : వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో గురువారం గురజాడ రైతు సేవాకేంద్రంలో రైతు లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వరి నారుమడిలో యాజమాన్య పద్ధతులను కీటక శాస్త్ర విభాగం సీనియర్ శాస్త్రవేత్త సుధారాణి తెలియజేశారు. కలుపు మందుల యాజమాన్య పద్ధతులను ఆత్మ ఏడీఏ శ్రీనివాస్ వివరించారు. ఎరువులు వాడే విధానాలను వ్యవసాయాధికారి గణేశ్‌రెడ్డి తెలియజేశారు. ఆత్మ వ్యవసాయ అధికారి పద్మజ, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పెడనలో బందెల దొడ్డి

పెడన : కాపుల వీధిలో మునిసిపాలిటీ పర్యవేక్షణలో బందెలదొడ్డి ఏర్పాటు చేశారు. ఇప్పటికి 15 ఆవులను పట్టుకుని బందెలదొడ్డిలో ఉంచగా తొమ్మిది ఆవుల యజమానులు ఒక్కొక్కరు రూ. 2వేల చొప్పున మునిసిపాలిటీకి జరిమానా చెల్లించి వాటిని విడిపించుకు వెళ్లారు. బందెలదొడ్డి ఏర్పాటుతో ఆవుల సంచారానికి బ్రేక్ పడింది.